# తిరుమలేశుని సన్నిధిలో




**డా॥ ఆర్. అనంత పద్మనాభరావు**

విశ్రాంత అదనపు డైరక్టర్ జనరల్, దూరదర్శన్

సెల్ : 98665 86805

**తిరుమలేశుని సన్నిధిలో**

**(డా॥ ఆర్. అనంతపద్మనాభరావు)**

ప్రథమ ముద్రణ : 2019 విజయదశమి

© రచయితవి

వెల : రూ. 120/-

ప్రతులకు :

**డా॥ ఆర్. అనంతపద్మనాభరావు**

408, సాయికృపా రెసిడెన్సీ

మోతీనగర్, హైదరాబాద్ - 500 114.

సెల్ : 9866586805, ఫోన్ : 040-48580813

E-mail : padmanabharao.revuru@gmail.com

**నవోదయ బుక్ హౌస్,**

కాచిగూడ, హైదరాబాద్.

డి.టి.పి. & ముద్రణ :

**అక్షయ గ్రాఫిక్స్**

చిక్కడపల్లి, హైదరాబాద్.

సెల్: 9989890588

E-mail : rajendratammisetty2@gmail.com

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | బ్రహ్మోత్సవ సంరంభం | ... | 8 |
| 2. | తి.తి.దే. ఉద్యోగం (ఏ.పి.వి. నారాయణశర్మ) | ... | 26 |
| 3. | వివిధ ట్రస్టులు | ... | 33 |
| 4. | వివిధ ప్రాజెక్టులు | ... | 37 |
| 5. | 60 ఏళ్ల నాటి తిరుపతి | ... | 50 |
| 6. | తిరుమలలో ప్రత్యేక దర్శనాలు | ... | 54 |
| 7. | నిత్య సేవలు | ... | 59 |
| 8. | వార్షిక సేవలు | ... | 63 |
| 9. | తిరు నక్షత్రోత్సవాలు | ... | 67 |
| 10. | కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం | ... | 74 |
| 11. | భక్త కవయిత్రి తరిగొండ వెంగమాంబ | ... | 79 |
| 12. | చెలికాని అన్నారావు | ... | 83 |
| 13. | ఆలయ పరిపాలనాదక్షులు | ... | 84 |
| | ఎ) బోర్డు అధ్యక్షులు బి) కార్యనిర్వహణాధికారులు | | |
| 14. | పి.వి.ఆర్.కె. ప్రసాద్ | ... | 87 |
| 15. | శ్రీనివాసుని కొలువులో పండితమండలి | ... | 91 |
| 16. | వివిధ ప్రాజెక్టుల అధికారులు | ... | 92 |
| 17. | వేద విశ్వవిద్యాలయం | ... | 95 |
| 18. | డా॥ కె.వి. రమణాచారి | ... | 95 |
| 19. | వేద పాఠశాల | ... | 100 |
| 20. | అన్నమయ్య | ... | 104 |

## 1. బ్రహ్మోత్సవ సంరంభం:

"క్షేత్రాణాం క్షేత్రముత్కృష్టం
తీర్థానాం తీర్థముత్తమం
శ్రీ వేంకటగిరిర్నామ
క్షేత్రం పుణ్యం మహీతలే"

ఏడుకొండలపై వెలసిన ఆ శ్రీనివాసుని తిరుమల క్షేత్రం అన్ని క్షేత్రాలలో ఉత్కృష్టమైనది. తీర్థాలలో పాపనాశము, ఆకాశగంగాది తీర్థాలు ఉత్తమం. స్వామి పుష్కరిణీ స్నానం పవిత్రం. సప్తర్షులు తిరుమలను సందర్శించిన అంశాన్ని తెనాలి రామకృష్ణుడు 'ఘటికాచల మాహత్యం'లో విపులంగా వర్ణించాడు. తలకు ఒక సీసం చొప్పున ఏడుగురు ఋషులు ఏడు సీస పద్యాలలో వెంకటేశ్వరస్వామి శరీర సౌందర్యాన్ని వర్ణించారు.

16వ శతాబ్ది చివరి భాగానికే తిరుమల ప్రసిద్ధంగా వుందనడానికి ఆ కాలం వాడైన పింగళి సూరన తన 'కళాపూర్ణోదయం'లో మణికంధరుని తిరుమల క్షేత్రాన్ని సందర్శించిన సందర్భం నిదర్శనం. మణికంధరుడు తిరుమలపై 3 అహోరాత్రాలు నివసించి స్వామిని దర్శించాడు. ఆ గంధర్వుడు స్వామిని ఆనందనిలయంలో దర్శించినప్పుడు ఇలా కనిపించాడు. పాదాల నుంచి శిరస్సు వరకు నఖశిఖపర్యంతం కవి వర్ణించిన సీసమిది:

సీ॥ మృదుపదాంబుజములు, మెఱుగుటందెలుఁ బైడి
దుప్పటియును, మొల ముప్పిడియును
మణిమేఖలయు, బొడ్డుమానికంబును, వైజ
యంతియు, నురమున నలరు సిరియు
వరదహస్తము, కటి వర్తిల్లుకేలు, శం
ఖము, చక్రమునుదాల్చు కరయుగంబు
తారహారంబులు, చారుకంఠంబు, ని
ద్దపు చెక్కులును నవ్వుదళుకు పసలు

గీ॥ మకరకుండలములును తామరల నెగడు
కన్నులు మనోజ్ఞనాసయు, కలికి బొమలు

ముత్తియపునామమును రత్నమకుటవరము
నెసగ గనుపట్టు శ్రీవేంకటేశు జూచె.

ఆ శ్రీనివాసునికి బ్రహ్మోత్సవాలను ఏటా ఆశ్వయుజ మాసంలో వైఖానసాగ మోక్తంగా నవాహ్నికంగా సెప్టెంబరు – అక్టోబర్ మాసాలలో నిర్వహిస్తారు. చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. బ్రహ్మరథం ముందుండి వాహన సేవలు జరుగుతాయి.

**రామానుజులు:**

రామానుజాచార్యులకు, తిరుమలకు అవినాభావ సంబంధం ఉంది. తిరుమల ఆలయ వ్యవస్థకు ఒక రూపాన్ని ఇచ్చింది ఆయన. అందులో ప్రధానం బ్రహ్మోత్సవ సంరంభం. ఊర్ధ్వపుండ్ర వివాదాన్ని ఆయన సున్నితంగా పరిష్కరించారు. రామానుజుల కాలం నాటికి కొండమీద బ్రహ్మోత్సవ కాలంలో కేవలం ధ్వజారోహణము, ధ్వజావరోహణం జరిగేవి. వాహన సేవలు అన్నీ తిరుచానూరులో జరిపేవారు. ఇది సరికాదని రామానుజులు తన కాలం నాడే తిరుమలలో ఉత్సవాలు జరిపించారు. మాడవీధుల విస్తరణ అప్పటికే పూర్తి అయింది. వాహనాలపై మలయప్పస్వామి విహరిస్తూ జనసందోహానికి ఆనందం కలిగించసాగాడు.

**అన్నమయ్య:**

16వ శతాబ్ది వాడైన తాళ్లపాక అన్నమాచార్యులు బ్రహ్మోత్సవ వైభవాన్ని వివిధ కీర్తనలలో వర్ణించాడు. కన్యామాసంలో శ్రవణానక్షత్రం రోజున కలియుగ దైవమైన వేంకటేశ్వరుడు తిరుమల క్షేత్రంపై స్వయంవ్యక్తమూర్తిగా అవతరించాడు. శ్రవణా నక్షత్రానికి తొమ్మిదిరోజుల ముందు ఉత్సవాలు ఆరంభిస్తారు. బ్రహ్మ జరిపే ఉత్సవాలు కావడం వల్ల ఇవి బ్రహ్మోత్సవాలు.

వాహనసేవలు ఇలా కొనసాగుతాయి: ఉదయం, సాయంకాలం వాహనాలలో మలయప్పస్వామి తిరుమాడవీధుల్లో సంచరిస్తాడు. శ్రీహరికి సేనాధిపతి అయిన విష్వక్సేనుల వారు ఉత్సవాలకు ముందు నడిచి కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తాడు. 'వీధులవీధుల విభుడేగీ నిదె' అంటాడు అన్నమయ్య.

వాహన సేవలివి: పెద్దశేష, చిన్నశేష, హంస, సింహ, ముత్యపు పందిరి, కల్పవృక్ష, భూపాలవాహనాలు, మోహినీఅవతారం, తిరుచ్చి, గరుడోత్సవము, హనుమంత, గజము, సూర్యప్రభ, చంద్రప్రభ, అశ్వవాహనాధిరూఢుడై స్వామి వేంచేస్తాడు.

## శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో...

స్వామి సన్నిధిలోని తిరుపతిలో రెండేళ్ళ ఎం.ఏ. పూర్తి చేయడం ఓ వరం! 1965–66 మధ్య మంచాల వీధిలో వున్నాను. 1966–67 మధ్య ఫైనల్ ఇయర్లో యునివర్సిటీ హాస్టల్ ఏ బ్లాక్‌లో చేరాను. ఆ సంవత్సరం 1966 సెప్టెంబరు 5న నేనొక సెమినార్ పేపరు తయారు చేసి ఎం.ఎ. విద్యార్థులు ఉభయసంవత్సరాల వారు, అధ్యాపకుల ముందు ప్రసంగించాను. అలా సెమినార్ ఏర్పాటు చేయడం అదే ప్రథమం. జి.యన్.రెడ్డి గారి ఆలోచన అది. భవిష్యత్తులో మేము తెలుగు అధ్యాపకులుగా చేరితే బెరుకు లేకుండా ఉండేందుకు ఈ ప్రణాళిక తయారుచేశారు.

నేను తిమ్మావజ్ఝల కోదండరామయ్య గారి ప్రియశిష్యుణ్ణి. ఆయన ఒక్కడికే కాదు, ఆచార్యులందరికీ అభిమానపాత్రుణ్ణి. ఆయన మాకు బాలప్రౌఢవ్యాకరణాలు పాఠం చెప్పారు. నాకు బాలవ్యాకరణం తొలి మూడు పరిచ్ఛేదాలు బి.ఏ. లోనే కంఠతా వచ్చు. అందువల్ల క్లాసులో ముందు వరుసలో కూచొని ఆయనను బాగా ఫాలో అయ్యేవాడిని. వారి సలహా మేరకు 'బాలప్రౌఢలు సాధింపని ప్రయోగ విశేషాలు' అనే సెమినార్ పేపరు తయారు చేశాను.

సెప్టెంబరు 5 అధ్యాపక దినోత్సవం. ఆ రోజే నా ఆరంగేట్రం. ఏ విధమైన బెరుకు లేకుండా 45 నిమిషాలు మాట్లాడాను. భవిష్యత్తులో అధ్యాపక వృత్తి స్వీకరించడానికి అలా శుభారంభం జరిగింది. ప్రొఫెసర్ జి.యన్.రెడ్డి తదితరులు అభినందించారు.

మా రూమ్‌లో నేను, ఏ.వి. సుబ్బారావు (శాతవాహన కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా తర్వాత చేరాడు) ఉండేవాళ్ళం. మా రూమ్‌కి మిగతా క్లాస్‌మేట్స్ వచ్చి నా దగ్గర వ్యాకరణ ముఖ్యసూత్రాలు చెప్పించుకునేవారు. టౌన్ లోకి వెళ్ళే సమయంలో కూడా సాహిత్య చరిత్ర చెప్పేవాడిని. మాతో చదివిన వారిలో వయసులో పెద్దవాడు బండ్లమూడి సత్యనారాయణ. మంచి పద్యకవి. ఏలూరు సి.ఆర్. రెడ్డి కళాశాలలో ట్యూటర్‌గా చేస్తూ ఎం.ఏ. చేయడానికి వచ్చాడు. తర్వాత అదే కాలేజీలో తెలుగు హెడ్‌గా రిటైరయ్యాడు. మిగతా మిత్రులలో ఉప్పలపాటి శ్రీరామమూర్తి, సి.వి.ఆర్. గుర్రెడ్డి, యస్.వి.కృష్ణారెడ్డి, ఏ.వి.నారాయణ, గంగరాజు ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకులుగా చేరారు. నేను కూడా 1967 డిసెంబరులో కందుకూరు

ప్రభుత్వకళాశాల అధ్యాపకుడిగా చేరి 1975 ఆగస్టు వరకు చేశాను. ఉషారాణి, మనోజ మద్రాసులో, భాస్కరశేషారత్నం, ఉదయిని పద్మావతీమహిళా కళాశాలలో అధ్యాపకులయ్యారు. చంద్రశేఖర్ కర్ణాటక ప్రభుత్వ కళాశాలలో చేరాడు.

**సి.వి. సుబ్బన్న అష్టావధానం:**

రాయలసీమ అవధానులకు ప్రశస్తి. ప్రొద్దుటూరుకు చెందిన సి.వి.సుబ్బన్న శతావధాని బాగా ప్రసిద్ధులు. ఆయన అష్టావధానాన్ని తెలుగుశాఖ పక్షాన 1966 డిసెంబరు 18న యూనివర్శిటీలో ఏర్పాటు చేశారు. సభకు రిజిస్ట్రారు వై. విశ్వనాథం అధ్యక్షులు. ప్రముఖ సాహితీవిమర్శకులు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతశర్మ ముఖ్య అతిథి. అధ్యాపకులు పృచ్ఛకులు. ఓరియంటల్ కళాశాల అధ్యాపకులు, స్వయంగా అవధాని అయిన గౌరిపెద్ద రామసుబ్బశర్మ సమస్యనిచ్చారు. గంటలు కొట్టడానికి అధ్యాపకులు కూచోడం భావ్యం కాదని ఫైనల్ ఇయర్ విద్యార్థినైన నన్ను కూచోబెట్టారు.

అప్పటికే నేను ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి 50కి పైగా సమస్యాపూరణలు ప్రసారం చేశాను. ఆంధ్రపత్రిక దినపత్రికలో నా కవితలు వచ్చాయి. వాటి అన్నింటిని మించి కాకినాడ నుండి వెలువడే సాహిత్య త్రైమాస పత్రిక – ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలో నా సుదీర్ఘవ్యాసం ప్రచురితమైంది – దాని విషయం – ఉత్తర రామాయణము – తిక్కన, కంకంటి పాపరాజుల శైలి. స్రవంతి మాసపత్రికలో చాలా సాహిత్య వ్యాసాలొచ్చాయి. ఈ నేపథ్యంలో నన్ను గంటావాదనకు కూచోబెట్టారు. మధ్యమధ్యలో అవధాని ధారణ చెడగొట్టడానికి గంటలు కొట్టాలి. 14 గంటలు కొట్టాను. అవధాని చివర్లో ఆ సంఖ్య సరిగ్గా చెప్పారు.

**గౌరిపెద్ద వారు ఇచ్చిన సమస్య నాకిప్పటికీ బాగా గుర్తు:**

"రాముని మాని రావణు ధరాసుత ప్రీతి వరించె భర్తగా"

సీతాదేవి రాముని కాదని రావణుని భర్తగా వరించడం అసంబద్ధం. మాములుగా సమస్యలో మొదటి పదాన్ని విరిచి పూరిస్తారు. సమస్య ఇచ్చినవారు పండితులు. ఆ సమస్యను ఏ విధంగాను పరిష్కరించలేరు. అందుకని అవధాని ప్రశ్నార్థకంగా పూరించవలసి వచ్చింది. ఆ పూరణ ఇలా కొనసాగింది.

**7. శ్రీ వేంకటేశ్వర వారసత్వ పరిరక్షణ ట్రస్టు:**

భారతీయ సంప్రదాయంలో ఆలయాలు సంస్కృతికి, వారసత్వానికి, సనాతన ధర్మానికీ ప్రతీకలు. అవి కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే గాక కళలు, సంస్కృతీ పరిరక్షణకు భాండాగారాలు. వీటిని పోషించడానికి దేవస్థానం నడుం కట్టింది. విరాళాలకు 0877-2264258.

**8. శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టు:**

1992లో ఈ నిధి ప్రారంభించబడింది. దేశీయ గోసంతతి బీజాలను కాపాడే ప్రయత్నంలో తిరుపతిలో గోశాలను నడుపుతున్నారు. ఏటా గోకులాష్టమిని ఈ ప్రాంగణంలో వైభవంగా జరుపుతారు. ఈ ప్రాంగణం చంద్రగిరి రోడ్ మీద రైలు గేటు దాటగానే విశాల ఆవరణలో వుంది. ఇక్కడ వేణుగోపాలస్వామి ఆలయం వుంది. గోవులు, అశ్వాలు, గజాలు ఇక్కడ పోషించబడుతున్నాయి. స్వామివారి ఉత్సవాలలో వాహనాలకు ముందు నడిచే గజాశ్వ, వృషభాలు ఇక్కడ పోషించబడి ఆయా ప్రదేశాలకు తరలి వెళతాయి. ఇక్కడి గోవుల పాలు స్వామివారి శుక్రవారం అభిషేకానికి పంపుతారు. సుశిక్షుతుడైన ఒక వెటర్నరీ డాక్టరు పర్యవేక్షణలో ఈ అమూల్య పశు సంతతి పోషించబడుతోంది. గోవులకు గడ్డిని ఇక్కడే వ్యవసాయ క్షేత్రంలో పెంచుతారు. గోవులకు స్నానాధికాలు చేయించి పవిత్రభావంతో చూస్తారు. యంత్రసహాయంతో పాలు పితుకుతారు. శంకరరెడ్డి ఈ గోశాల అధిపతి. వివరాలకు 0877-2264570.

**9. వెంకటేశ్వర విద్యాదాన ట్రస్టు:**

దారిద్ర్యరేఖకు దిగువన ఉండే విద్యార్థులు ఉన్నతవిద్య నభ్యసించడానికి ఈ పథకం ప్రవేశపెట్టారు. విరాళాలకు 0877-2264039.

**10. CSR - కంపెనీల సామాజిక బాధ్యత పథకం:**

కంపెనీల చట్టం ప్రకారం సామాజిక బాధ్యత పథకం అమల్లో వుంది. ఆ పథకం క్రింద దేవస్థానానికి విరాళాలు అందించవచ్చు. వివరాలకు 0877-2264258 లేదా cdms@tirumala.orgతో సంప్రదించాలి.

**11. విదేశీ ద్రవ్యవిరాళం:**

దేవస్థానానికి విదేశీమారకద్రవ్యం విదేశాలలో ఉండేవారు విరాళంగా అందించవచ్చు. వీరు ఒక కోటి, 50 లక్షలు, 10 లక్షల విరాళాలు విదేశీ ద్రవ్య రూపంలో అందిస్తే దర్శన వసతి సౌకర్యాలు కల్పిస్తారు. ఆన్‌లైన్‌లో కూడా విరాళాలు హుండీ ద్వారా (ఈ-హుండీ) సమర్పించవచ్చు. దీనికిగాను dyeodonorcell@tirumala.orgతో సంప్రదించవచ్చు.

**12. శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టు:**

వేదాలను పరిరక్షించే వ్యవస్థలో భాగంగా ఈ నిధిని 2007లో ప్రారంభించారు. సనాతనహిందూధర్మ పరిరక్షణ దీని లక్ష్యం. విరాళాలకు 0877-2264258.

ఈ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేద పండితులకు మాస వారీ భృతి కల్పిస్తున్నారు. కిశోర విద్యాపథకంక్రింద వేదపండితుడు ఒకరు లేదా ఇద్దరికి వేదం కొన్ని సంవత్సరాలు అధ్యయనం చేయిస్తారు. శిష్యులకు, గురువునకు జీవనభృతి కలిగిస్తారు. వివిధ దేవాలయాలలో వేదపండితులు వేదం పఠించేందుకు ఆయా ఆలయ అధికారుల పర్యవేక్షణలో మాసవారీ జీతాలు చెల్లిస్తారు. ఏటా వేదపండితుల ఎంపిక జరుగుతుంది.

ఈ పథకం అమలు ఎలా జరుగుతోందో క్షేత్రస్థాయిలో పరిశీలించి సలహాలు. సూచనలు అందించేందుకు 2008లో అప్పటి కార్యనిర్వహణాధికారి డా. కె.వి.రమణాచారి ఒక కమిటీని ఏర్పరచారు. అందులో నేనూ, ఆచార్య కె.సర్వోత్తమరావు సభ్యులం. మేము గుంటూరు, విజయవాడ పరిసరప్రాంతాలు వారం రోజులు పర్యటించి వేదపండితుల సూచనలు స్వీకరించి ఒక నివేదిక ఇచ్చాము. ప్రకాశం జిల్లా సింగరాయకొండ సమీపంలోని వైదన గ్రామంలో ఉన్న వయోవృద్ధ వేదపండితులు శ్రీ రామమూర్తిగారిని దర్శించి ఆశీస్సులు తీసుకున్నాము.

ఒక ఆలయంలో వేద పండితుడు వేదాన్ని నోట్లోనే స్మరించడం చూసి ఆయనను "అలా చేస్తున్నారేమని" అడిగాము. వేదం పైకి చదవకూడదని జవాబిస్తే ఆశ్చర్యపోవడం మా వంతు అయింది. కొన్నిచోట్ల వేదపండితులు గైర్హాజరు అవుతున్నారు. వేతనాలు పెంచాలని కొందరు సూచించారు. ప్రతినెలా వారికి చెక్కులు బ్యాంకులో నేరుగా చేరుతుండటం హర్షణీయం.

**వసంతోత్సవం:**

ఆర్జిత బ్రహ్మోత్సవం జరిగిన వెంటనే ముగ్గురు మూర్తులను పక్కన కూచోబెట్టి వసంతోత్సవం జరుపుతారు. ఏటా మూడు రోజులపాటు జరిగే వసంతోత్సవాలకు ఇది సంక్షిప్త రూపం. ఇది ఆర్జిత సేవ. భక్తులు ఈ సేవ పూర్తిచేసుకుని సుపథం ద్వారా దర్శనానికి వెళతారు. ఈ సేవలన్నీ లోపలే మండపాలలో జరుగుతాయి. సేవా టికెట్లు గలవారు మాత్రమే చూడగలరు.

**సహస్రదీపాలంకారసేవ:**

ఈ సేవ ఆరుబయట మండపంలో సాయంకాలం ఐదు గంటలకు మొదలై 30 నిమిషాల పాటు జరుగుతుంది. వేయి నేతి దీపాలను పరిచారకులు ముందుగానే వెలిగిస్తారు. 4.45 నిమిషాలకు వసంతమండపం నుండి (ధ్యాన మందిరం లేదా వాహన మండపం) ఉత్సవంగా బయలుదేరి ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామి ఉయ్యాలపై కూర్చుంటాడు. డాలర్ శేషాద్రి ఆధ్వర్యంలో ఊయలను నలుగురు ఊపుతారు.

ముందుగా ఐదు నిమిషాలు వేదపఠనం జరుగుతుంది. ఆపైన అన్నమాచార్య ప్రాజెక్టువారు నియమించిన గాయకగాయనీమణులు ఒకటి రెండు, మూడు అన్నమాచార్య కీర్తనలను ఆలపిస్తారు. వెంటనే పురందరదాసు కీర్తన ఒకటి దాససాహిత్య ప్రాజెక్టు పక్షాన గాయని గానం చేస్తారు. చివరలో నాదస్వర కైంకర్యంతో హారతులు అందుకుంటారు మలయప్ప స్వామి. ఇది ఆర్జిత సేవ. విశేషంగా సామాన్య భక్తులు కూడా ఉచితంగా దర్శించుకోవచ్చు. వెంటనే మాడ వీధులలో ఉత్సవంగా బయలుదేరి మహాద్వారం గుండా సూర్యాస్తమయం లోపు మలయప్ప స్వామి రంగనాయక మండపానికి చేరుకుంటారు.

**ఏకాంత సేవ:**

దీనిని పాన్పుసేవా దర్శనం అంటారు – ఒకప్పుడు ఇది ఆర్జిత సేవ. ప్రస్తుతం సమయాభావం వల్ల దీనిని ఏకాంతంలో జరుపుతున్నారు. ఈ సేవలో ఇద్దరు ప్రాచీన భక్తుల కైంకర్యాలు నడుస్తాయి. అర్ధ మండపంలో ఊయలలో వెండి విగ్రహం అయిన భోగశ్రీనివాసమూర్తిని పాన్పుపై పవళింపు చేస్తారు. అన్నమాచార్య సంతతికి చెందిన వ్యక్తి రోజూ ఒక కీర్తన స్వామికి ఆలపిస్తాడు. నైవేద్యంగా పాలు, జీడిపప్పు సమర్పిస్తారు.

చివరగా తరిగొండ వెంగమాంబ కైంకర్యం చేసిన ఒక వెండి పళ్లెంలో కర్పూర హారతి ఇస్తారు. ఆ పళ్ళెంపై దశావతారాలలోని ఒక అవతారాన్ని ముత్యాలతో అలంకరిస్తారు. దానిని అన్నమయ్య లాలి – వెంగమాంబ హారతి అని పిలుస్తారు.

నైవేద్యంగా సమర్పించిన పాలు, జీడిపప్పులను ప్రసాదంగా అక్కడ చేరిన అధికార గణానికి, పరిచారకులకు అందిస్తారు. ఏకాంతసేవ డ్యూటీలో ఉన్న అధికారికి ఆ భాగ్యం లభిస్తుంది. నేను 2 సంవత్సరాలు నెలకు రెండుమార్లు ఆ మహద్భాగ్యాన్ని పొందాను. ఏకాంతసేవ పూర్తికాగానే బంగారువాకిలి తలుపులు బిగిస్తారు. బయట హుండీలలో వచ్చిన కానుకలను సంచులలో కట్టి ఆ రాత్రి వరకు వచ్చిన వాటిని పరకామణి అరమరలో భద్రపరిచి 'సీలు' వేస్తారు. భోగ శ్రీనివాసమూర్తి సంవత్సరంలో 11 నెలలు ఆ పాన్పుపై శయనించగా, ధనుర్మాసంలో కృష్ణస్వామి నిద్రిస్తాడు. ఆ నెలలో సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై అధ్యయనం చేస్తారు.

**వారోత్సవాలు, విశేషసేవ:**

ప్రతి సోమవారం వైఖానసాగమోక్తంగా విశేషసేవ నిర్వహిస్తారు. శ్రీదేవీభూదేవి సమేత మలయప్ప స్వామి విగ్రహాలను కళ్యాణమండపానికి వేంచేపు చేసి హోమము, తిరుమంజనం జరుపుతారు. ఇది ఆర్జిత సేవ. 2 నెలలు ముందుగా బుక్ చేసుకోవాలి. ఈ సేవను 1991 ఏప్రిల్ 8 న ప్రారంభించారు.

**అష్టదళపాదపద్మారాధన:**

రెండో అర్చన పూర్తికాగానే ప్రతిమంగళవారం 108 బంగారు పద్మాలతో మూలవిరాట్టుకు అర్చన జరుగుతుంది. ఇది ఆర్జితసేవ. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు స్వర్ణోత్సవాల సందర్భంగా 1984లో ఈ సేవ ఆరంభించారు. భక్తిప్రపత్తులతో దీనిని దర్శిస్తారు.

**సహస్రకలశాభిషేకం:**

ప్రతి బుధవారం భోగ శ్రీనివాసమూర్తికి 1008 వెండి బిందెలతో ఈ అభిషేకం నిర్వహిస్తారు. సర్వదర్శనానికి ముందుగా ఇది జరుపుతారు.

**ఆలయ సిబ్బంది ఉత్సాహం:**

ఈ తిరుమంజన కార్యక్రమాన్ని రాములవారి మేడలో వుండే అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమదంగదాదుల విగ్రహాలకు కూడా ఏకాంతంలో చేస్తారు. ఆలయం మొత్తం శుద్ధి చేయడమే దీని లక్ష్యం. అందుకే ఆనందనిలయం నిత్యం స్వామికటాక్షవీక్షణసుగంధాలతో పరిమళభరితం అవుతుంది. విగ్రహాలను అభిషేకానంతరం శుభ్రంగా తుడిచి పట్టువస్త్రాలు అలంకరింపజేస్తారు.

గర్భాలయం లోపల అర్చకులు, పరిచారకులు, ఏకాంగులకు మాత్రమే ప్రవేశం గాన వారే ఈ విధులు పూర్తి జేస్తారు. కులశేఖర పడి (తొలి గడప) నుండి దేవస్థానం సిబ్బంది ఆనందోత్సాహాలతో భక్తియుతంగా శుభ్రం చేస్తారు. గర్భాలయం లోపల గోడలకు, పై కప్పులకు అంటుకున్న ధూళి, బూజును, కర్పూరం వెలిగించడం వల్ల కలిగిన మసిని అర్చకాదులు గోకుతారు. శీకాయ నీళ్ళతో రుద్ది కడుగుతారు.

గర్భాలయం వెలుపలి కార్యక్రమాన్ని సిబ్బంది మొదలెడతారు. శీకాయ, వాషింగ్ సోడా కలిపిన వేడి నీళ్ళతో రబ్బరు ట్యూబులు పిచికారీ చేస్తుండగా కడిగి పరిశుభ్రం చేస్తారు. ఇదొక సంతోష వాతావరణంలో జరుగుతుంది. కార్యనిర్వహణాధికారి మొదలు చిన్న ఉద్యోగి వరకు ఒంటినిండా సుగంధద్రవ్యాలు నిండగా ఆనందోత్సాహంతో తిరుగుతారు. స్వామి సేవలో ఇదొక భాగ్యం.

**ఇతర ఆలయాలు:**

కేవలం ఆనంద నిలయంలోనే కాదు, ఆలయంలోపల వున్న వరదరాజస్వామి ఆలయం, వకుళమాత మందిరం, రామానుజుల సన్నిధి, యోగనారసింహస్వామి ఆలయం, విష్వక్సేనుల సన్నిధి, గరుడాళ్వారు సన్నిధి, తాయారు సన్నిధి – అన్నింటినీ పరిచారకాదులు శుభ్రం చేస్తారు.

రంగనాయక మండపంలోని బంగారు, వెండి వాహనాలను తుడిచి మెరుగులు పెడతారు. ఇలా చేయడంవల్ల వాటి కాంతి అలానే మెరుస్తూ భక్తులకు నయనానందకరంగా వుంటుంది. ఈ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ముఖ్యోద్దేశం అదే. లేకపోతే చిలుము

పట్టి వాహనాలు కాంతి విహీనం అవుతాయి. మన పెద్దలు ఏ ఉత్సవాన్ని ఏర్పరిచినా అందులొ శాస్త్రీయత వుండి తీరుతుంది.

**పరిమళభరితం:**

శుభ్రం చేయడం ఒక ఎత్తు. రెండో ఎత్తు పరిమళం పూత. ఇదొక సంరంభం. కురాళం - అంటే 6 x 6 అడుగుల చతురస్రాకారం గల మఖ్‌మల్ వస్త్రాన్ని వెండి తట్టలో కార్యనిర్వాహకులు పట్టుకొంటారు. ఇది మూలమూర్తిపై ఏ విధమైన ధూళి పడకుండా వుండేందుకు తీసుకునే చర్య. ఇదే సమయంలో జియ్యంగారు పరిమళ ద్రవ్యాల వెండిగిన్నెను పట్టుకొంటారు. దేవస్థానాధికారులు, జియ్యంగారు ముందు నడవగా ఆ పరిమళాన్ని పరిమళపు అర నుండి ఛత్రచామరాది రాజలాంఛనాలతో ఆలయం లోపలికి ప్రదక్షిణ పూర్వకంగా తెస్తారు. ధ్వజస్తంభం చుట్టూ తిరిగి వచ్చి ఈ కురాళాన్ని, పరిమళాన్ని గర్భాలయంలోని అర్చకులకు అందిస్తారు.

అర్చకస్వాములు కురాళం వస్త్రాన్ని విగ్రహం పై భాగంలో కడతారు. జియ్యంగారు తెచ్చిన పరిమళాన్ని అర్చకులు, పరిచారకులు ఆలయం గోడలకు పూస్తారు. మిగతా ప్రదేశాలు, ఆలయాలలో కూడా ఈ కార్యక్రమం అదే సమయంలో ఇతర ఉద్యోగులు నిర్వహిస్తారు. బంగారు వాకిలి దాకా ఇతర ఉద్యోగులు, సేవకులు పరిమళాన్ని నింపుతారు. పరిమళం ఎలా తయారు చేస్తారు?

సుద్దపొడి, శ్రీ చూర్ణం, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమగడ్డ పెద్ద పెద్ద సైజులలో ముందు రాత్రి గంగాళాల నిండా కలిపి వుంచుతారు. ఇదొక పలచని లేహ్యంగా తయారయి ఉంటుంది. మర్నాడు ఉదయం దీనిని గోడలకు పూస్తారు. ఈ కార్యక్రమం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు కొనసాగుతుంది. వంటశాలలలో కూడా ఇలా చేస్తారు. ఆ తర్వాత ఆలయంలో పూతలు పూసిన పరిమళ ద్రవ్యాన్ని శుభ్రంగా నీటితో కడుగుతారు. నేలను శుభ్రం చేస్తారు. అంతా పూర్తి కాగానే కులశేఖరపడి తెరలు వేసి అర్ఘ్యాది ఉపచారాలు చేసి కర్పూరహారతి సమయంలో తెర తీస్తారు. అప్పుడు ఆర్జితసేవల భక్తులకు దర్శనం కలుగుతుంది. అదొక దివ్యానుభూతి. ఈ సేవకుడు దానికి అర్హుడయ్యాడు.

**ప్రత్యేక కల్యాణోత్సవం:**

దశబ్దాలకాలం నుండి మహా ద్వారం దాటి ముందుకు నడవగానే ఎడమ వైపున వున్న రంగమంటపంలో కల్యాణోత్సవాలు ఆర్జిత సేవగా రోజూ నిర్వహించేవారు. అక్కడ కేవలం 25 మంది దంపతులు మాత్రమే కూర్చునే అవకాశం వుంది. దానిని బయట మరో ప్రదేశంలో నిర్వహించి రెండు వందలమంది గృహస్థులు పాల్గొనే ఏర్పాటును ప్రసాద్ ఏర్పరచారు. అర్చకమిరాసీదారులను సంప్రదించి వారికి రావలసిన బహుమానాలను కట్టుదిట్టం చేసి నూతన కల్యాణోత్సవాల పద్ధతిని ప్రవేశపెట్టారు. కొత్త మంటపాన్ని నిర్మించి అధికసంఖ్యలో గృహస్థులు పాల్గొనే అవకాశం కల్పించారు. పెద్ద కల్యాణోత్సవానికి 1250 రూపాయలు, ప్రత్యేక కల్యాణముకు 500 రూపాయలుగా నిర్ణయించారు. ప్రస్తుతం వెయ్యి రూపాయలకే ఈ సేవ లభిస్తోంది.

**అనూహ్య సంఘటనలు :**

ప్రసాద్ పరిపాలనాదక్షతకు నిదర్శనాలుగా ఎన్నో ఉదాహరణలు చెప్పవచ్చు. తిరుమలలో పద్మావతీ గెస్ట్ హౌవుస్ నిర్మాణానికి బోర్డు సభ్యులు ఆర్.పి. గోయెంకాని వొప్పించడం, హైదరాబాదులో రామకృష్ణ మఠం భవన నిర్మాణానికి టిటిడి నిధులు 12 లక్షలు మంజూరు చేయించడానికి ముఖ్యమంత్రి చెన్నారెడ్డిని అంగీకరింపజేయడం, యం.యస్.సుబ్బలక్ష్మి స్వగృహం అమ్మకుండా నిధులు మంజూరు చేయించి ఆమె చేత అన్నమాచార్య కీర్తనలు పాడించడం వంటి కార్యకలాపాలకు శ్రీనివాసుని అనుగ్రహం ప్రసాద్ పైన ఎంతైనా వుంది.

**హిందూ ధర్మ పరిరక్షణ సంస్థ :**

1981లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ టిటిడిలో హిందూ ధర్మపరిరక్షణ ట్రస్టును ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పాటు చేసింది. అది ఇప్పుడు హిందూ ధర్మ ప్రచార పరిషత్‌గా పనిచేస్తోంది. వేదధ్యాయనానికి ఉపకార వేతనాలు మంజురు చేసే పద్ధతి ప్రవేశ పెట్టారు డా. డి. అర్కసోమయాజి తొలి కార్యదర్శి. మత మార్పిడులు చేయిస్తున్నారనే అపవాదు ప్రసాద్‌పై పడింది. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్ ముందు పంచాయతీ జరిగింది. అయితే అది నిజ నిర్ధారణకు నిలబడలేదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Tirumalesuni+Sannidhilo

* * *